
ప్రజాశక్తి

గురువారం 23 జనవరి 2025



పార్వతీపురం మన్యం

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మరిన్ని విద్యుత్ భారాలు వేయడమే లక్ష్యంగా యాక్సిస్ విండ్ ఫార్మ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థతో చేసుకున్న ఒప్పందానికి వ్యతిరేకంగా మరో పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. యాక్సిస్ సంస్థ ప్రజలపై విద్యుత్ భారాలు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తెలిపారు. ఈ ప్రతిపాదనలు అమలు చేయడానికి ఎపిఇపిడిసిఎల్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.



ధర్నా చేస్తున్న దళిత మహిళలు

బల్బు, ఫ్యాన్‌కే రూ.4 వేలు



నా ఇంట్లో ఒక బల్బు, ఒక ఫ్యాన్ మాత్రమే ఉన్నాయి. నాకు 4 వేల రూపాయలు బిల్లు చెల్లించాలని ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉచిత విద్యుత్ అని ఒకవైపు చెపుతూనే దళితుల ఇళ్లకు విద్యుత్ బిల్లులు ఎందుకు వసూలు చేస్తున్నారు.?

– చింతల అప్పమ్మ, బంగారమ్మపేట

మంత్రి ఇలాకాలో..
దళితులకు విద్యుత్ షాక్

- బిల్లులు కట్టలేదని సరఫరా నిలిపివేత
- రోడ్డుపై ధర్నా చేసిన మహిళలు

ప్రజాశక్తి-సాలూరు

సాక్షాత్తు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇలాకాలో దళితులకు విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ బిల్లులు కట్టలేదన్న సాకుతో అధికారులు దళితుల ఇళ్లకు కరెంటు సరఫరా నిలిపివేశారు. ఫలితంగా పట్టణంలోని బంగారమ్మపేటలో దళితవాడలో నివశిస్తున్న కుటుంబాలు అంధకారంలో ఉండిపోయాయి. మంగళవారం పార్వతీపురం నుంచి వచ్చిన ఇఆర్ఒ అధికారులు దళితకాలనీలో విద్యుత్తు బిల్లులు చెల్లించని వారి ఇళ్లకు ఫీజులు తొలగించారు. దళితులకు, గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వాడుకోవచ్చునని ప్రభుత్వం ఒకవైపు చెపుతూనే దళితుల ఇళ్లకు బిల్లులు పంపిణీ చేస్తున్నారు. దీంతో వారు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఎన్నడూ విద్యుత్ బిల్లుల గురించి అడగలేదని, ఇప్పుడు ఎలా అడుగుతున్నారని వారు ప్రశ్నించారు. దీంతో బుధవారం ఉదయం దళిత మహిళలు దండిగాం రహదారిపై ధర్నా నిర్వహించారు. తామంతా రెక్కాడితే గాని డొక్కాడని బడుగు వర్గాలకు చెందిన వారమని, తమకు ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవని వాపోయారు. నెలనెలా ప్రభుత్వ నిబంధనలకు లోబడే విద్యుత్ వినియోగిస్తున్నామని, మరి అలాంటప్పుడు బిల్లులు ఎందుకు పంపిణీ చేస్తున్నారని వారు నిలదీశారు.

రెండు బల్బులు, ఒక ఫ్యాన్‌కి 5వేల పైన బిల్లు




ఇంట్లో రెండు బల్బులు, ఒక ఫ్యాన్ వాడుతున్నాను. 5731 రూపాయల బిల్లు కట్టాలని బెదిరిస్తున్నారు. కట్టకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఇటీవలే నా మెదడుకు శస్త్రచికిత్స జరిగింది. నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వాడుకోవచ్చునని ప్రభుత్వం చెబుతోంది. మరి బిల్లులు ఎందుకు పంపిణీ చేస్తున్నారు.?

– ముగడ సుశీలమ్మ, దళిత కాలనీ, బంగారమ్మపేట

నా దృష్టికి రాలేదు

బంగారమ్మపేటలో దళితవాడలో విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా సరఫరా నిలిపివేసినట్లు నా దృష్టికి రాలేదు. స్పెషల్ టీం సభ్యులు బకాయిల వసూళ్లపై డ్రైవ్ నిర్వహించారు.

– రంగారావు, ఎడిఇ, సాలూరు



పొక్లెయినర్‌ను అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు, దళితులు

క్వారీ యజమాని కన్ను

- అధికార పార్టీ అండతో భూమిని చదును చేసేందుకు ప్రయత్నం
- అడ్డుకున్న సాగులో ఉన్న దళితులు
- వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-సాలూరు

మండలంలోని కరాసువలస రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూమిపై పట్టణానికి చెందిన క్వారీ యజమాని కన్ను పడింది. ఆ భూమిని కాజేసేందుకు పొక్లెయినర్ సాయంతో బుధవారం చదును చేసే పనులు ఆయన చేపట్టారు. దీంతో అప్పటికే ఆ భూమి సాగులో ఉన్న దళితులు.. సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన పొక్లెయినర్‌ని అడ్డుకున్నారు. గత 50 ఏళ్లుగా సాగులో ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేసే హక్కు క్వారీ యజమాని సుతాపల్లి రాముకి ఎక్కడిదని వారు ప్రశ్నించారు. తమ సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. క్వారీ యజమాని సుతాపల్లి రాముపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుతాపల్లి రాముతో పాటు మరికొంతమంది వ్యాపారులు ఈ ప్రభుత్వ భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సాగులో ఉన్న దళితులను బెదిరిస్తున్నారని, టిడిపి ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉన్నాయని, మీ దిక్కున్న చోట చెప్పుకోవాలని దౌర్జన్యం చేస్తున్నారని సోంబార్కి సింహాచలం, బోడియ్య, వీరయ్య, సన్యాసి ఆవేదన వ్యక్తం చేశారు.

సుతాపల్లి రాముపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కరాసువలస రెవెన్యూ పరిధిలో దళితులు సాగు చేస్తున్న భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న సుతాపల్లి రాముపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. దళితులను బెదిరిస్తే ఆందోళన చేపడతాం. సాగులో ఉన్న దళితులకు పట్టాలివ్వాలి.

– ఎం.శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి

ప్రశాంతంగా జెఇఇ మెయిన్స్

అభ్యర్థులు ఉరుకులు..పరుగులు ● ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఇంజినీరింగ్, బిఆర్క్‌లో ప్రవేశాలకు ఎన్‌టిఎ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జెఇఇ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) మెయిన్స్ పరీక్ష బుధవారం జిల్లాలో తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. ఈనెల 22 నుంచి 30వరకు జరుగనున్న ఇంజినీరింగ్, బిఆర్క్ పరీక్షలకు జిల్లాలోని ఎంవిజిఆర్, గాజులరేగలోని ఐయాన్ డిజిటల్ కేంద్రాలను కేటాయించారు. ఈ రెండు కేంద్రాల్లోనూ 5447 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే తొలి సెషన్ పరీక్ష రాసేందుకు అభ్యర్థులు ఉదయం 7గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగింది. రెండుగంటల ముందే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని ఆదేశించడంతో అభ్యర్థులు ఉదయం 7గంటలకే చేరుకున్నారు. విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినప్పటికీ అయాన్ డిజిటల్ జోన్ సిబ్బంది విద్యార్థులు హాల్ టికెట్‌లు సరి చూసుకునేందుకు నోటీసుబోర్డు పెట్టలేదు. అప్పటికే విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో ఏడున్నర గంటల సమయంలో హాల్ టికెట్స్ నెంబర్లతో కూడిన నోటీసులు అంటించారు. దీంతో విద్యార్థులు తల్లి తండ్రులు సిబ్బంది తీరుపై మండిపడ్డారు. తాము ఏడు గంటలకే చేరుకున్నా అయాన్ డిజిటల్ జోన్ సిబ్బంది హాల్ టికెట్స్ చూసుకునేందుకు బోర్డు లు పెట్టకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎన్‌టిఎ విధించిన నిబంధనలతో విద్యార్థినుల తలకు ఉన్న శంపిన్నులను అక్కడే తీసేయాల్సి వచ్చింది. ఏడున్నర గంటలకు ఒక్కో విద్యార్థిని తనిఖీ హాల్ టిక్కెట్‌ను, గుర్తింపుకార్డును పరిశీలించి లోపలకు అనుమతించారు. 8.45గంటలకు వచ్చిన విద్యార్థులను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు అక్కడి సిబ్బంది బతిమలాడడంతో లోపటకు అనుమతించారు. ఉదయం 8.50 గంటల సమయంలో ముగ్గురు విద్యార్థులు పరీక్ష రాసేందుకు రావడంతో అప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయినందున లోపలికి అనుమతించేది లేదని సిబ్బంది తేల్చి చెప్పారు. విద్యార్థుల తల్లి తండ్రులు బతిమాలినా సమయం అయిపోయిందని అనుమతించక పోవడంతో వారు తిరుగు ముఖం పట్టారు.



సమయం ముగిసి గేటుకు తాళం వేయడంతో వేచిచూస్తున్న విద్యార్థులు





పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులతో తల్లిదండ్రులు ; పరీక్షా కేంద్రానికి పరుగెత్తుకుంటూ వస్తున్న విద్యార్థిని



ఆరిన ఆశా దీపం

పరుగు పోటీలో ఊపిరి వదిలిన కానిస్టేబుల్ అభ్యర్థి


కోమటిపల్లిలో విషాదం

కుమారుడు బాగా చదువుకొని ఉద్యోగం చేసి తమను పోషిస్తాడని కలలు గన్న ఆ తల్లిదండ్రుల ఆశలు ఆడియాశలయ్యాయి. కానిస్టేబుల్ ప్రాథమిక అర్హత పరీక్షలో ఉత్తీర్ణుడై దేహదారుఢ్య పరీక్షకు ఎంపికైన తమ బిడ్డ తప్పకుండా కానిస్టేబుల్ అవుతాడని భావించిన తల్లిదండ్రులకు పుత్ర శోకమే మిగిలింది. పరుగుపోటీకి వెళ్లొస్తానని తల్లిదండ్రులకు చెప్పిన కొడుకు ఆ పరుగులోనే ప్రాణాలు విడవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. తమ కలల దీపం ఆరిపోవడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ప్రజాశక్తి-దత్తిరాజేరు/విజయనగరంకోట

స్వయిఫండరీ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకానికి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 21న జరిగిన దేహ దారుఢ్య (పిఇటి) పరీక్షలో పాల్గొన్న దత్తిరాజేరు మండలం కోమటిపల్లికి చెందిన బొడుపల్లి రవి కుమార్ (22) మృతి చెందాడు. 16 వందల మీటర్ల పరుగు పోటీలో పరుగెడుతూ మధ్యలో కుప్పకూలి పోయాడు. తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కోమటిపల్లికి చెందిన బవురుబిల్లి అప్పలరాము, అక్కమ్మ దంపతుల కుమారుడు రవి కుమార్ (22) డిగ్రీ చదువుకున్నాడు. పోలీసుకానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక రాతపరీక్షలు ఉత్తీర్ణుడైన రవికుమార్ మంగళవారం నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షకు హాజరయ్యాడు. పిఇటి పరీక్షల్లో ప్రాథమిక అర్హత పరీక్ష అయిన 1600 మీటర్ల పరుగులో పాల్గొన్నాడు. పరుగెడుతూ..పరుగెడుతూ అస్వస్థతతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నారన్నాడు. అక్కడే ఉన్న అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, వైద్య సిబ్బంది 108 వాహనంలో మహారాజా సర్వజన ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అయినప్పటికీ, అభ్యర్థి ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో నగరంలోని తిరుమల-మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌పి వకుల్ జిందాల్ ఆస్పత్రిలో రవికుమార్‌ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వారి సూచనల మేరకు అక్కడి నుంచి మంగళవారం రాత్రి విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో రవికుమార్ కన్నుమూశాడు.

అప్పలరాము, అక్కమ్మకు ముగ్గురు పిల్లల్లో చిన్నవాడు రవిశంకర్. వ్యవసాయ కూలి పనులు చేసుకొని పిల్లలను చదివించారు. పెద్దకుమారుడు గుజరాత్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, అక్క రాజేశ్వరికి వివాహమైంది. రవిశంకర్ డిగ్రీ వరకు చదువుకొని ప్రభుత్వ ఉద్యోగానికి ప్రిపేరవుతున్నాడు. కానిస్టేబుల్ పోస్టుకు ప్రాథమిక రాత పరీక్షలు అర్హత సాధించడంతో తల్లి దండ్రులు మురిసి పోయారు. తమ కుమారుడికి కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.కానీ ఉద్యోగం కోసం పరుగుపోటీలో రవికుమార్ ప్రాణాలు వదలడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.



రవికుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్



రవికుమార్ (ఫైల్)

27న కురుపాంలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 27న కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్ప్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని, 18 ఏళ్ల నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఈ మేళాలో 23 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నెంబర్‌తోపాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరుకావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వెంకటరాయుడు కోనేరుకు మహర్దశ

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీలో వెంకట రాయుడు కోనేరుకు మహర్దశ పట్టనుంది. బుధవారం సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ చెరువును పరిశీలించారు. చెరువు సంబంధించి వివరాలను సేకరించారు. బోటు షికారు ఏర్పాటుతోపాటు అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు సూచించారు. నగర పంచాయతీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, వార్డు కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కె.విజయ్ కుమార్, కొరికాన గంగనాయుడు, ఆకులకుమార్ తదితరులు ఉన్నారు.

అతిసార వ్యాపించకుండా ముందస్తు చర్యలు

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

అతిసార వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అధికారులను ఆదేశించారు. బుధవారం కురుపాంలోని గౌడువీధి, గాంధీనగర్ వీధిలోని కాలువలను పరిశీలించారు. అతిసార వ్యాప్తి చెందడానికి గల కారణాలను అధికారులకు అడిగి తెలుసుకొన్నారు. అతిసార నుండి కోలుకొన్న బాధితులను పరామర్శించారు. గాంధీనగర్ వీధిలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. బాధితుల యోగక్షేమాలు, ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలపై డాక్టర్ చీకటి శంకరరావుకు అడిగి తెలుసుకొన్నారు. ముందస్తుగా గ్రామంలో ఇంటింటి సర్వే చేసి, ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడుతూ పారిశుధ్య పనులు చేపట్టి, తాగునీటి కొళాయి పైపులైన్లు లీకులు లేకుండా చూడాలని చెప్పారు. అన్ని ట్యాంకులు శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు, ఎఇ ఆర్.వేణుగోపాల్, పంచాయతీ ఇఒ ఎం.ధనంజయరావు, టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోల రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, జనసేన మండల కన్వీనర్ ఎన్.వంశీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కొత్తగూడ గ్రామంలో బుధవారం అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. కొత్తగూడ గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధితులను, రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు నిత్యవసర సరుకులను అందజేసి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, మండల అధ్యక్షులు పాడి సుదర్శనరావు, టిడిపి సీనియర్ నాయకురాలు బిడ్డిక పద్మావతి, కద్రక కళావతి, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి సందర్శన

సాలూరు రూరల్ : మండలంలోని కరాసువలసలోని కెజిబివిని గుంటూరు నుండి వచ్చిన సామాజిక తనిఖీ బృందం బుధవారం సందర్శించింది. వసతులను పరిశీలించింది. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం, సిబ్బంది పనితీరును బృందం పరిశీలించింది. రికార్డులన్నీ సక్రమంగా ఉండటంతో సామాజిక తనిఖీ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశాంతి పాల్గొన్నారు.

ఎఒబి మార్గంలో సిసి కెమెరాలు

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేట నుంచి ఒడిశాలోని అలమండ వరకు నేరాల నియంత్రణ కోసం సిసి కెమెరాలను పోలీసులు ఏర్పాటుచేశారు. ఇటీవల సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి, నాటు సారాతో పాటుగా నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టేందుకు, నేరాల నియంత్రణకు, అధిక లోడుతో వస్తున్న వాహనాలను గుర్తించేందుకు సిసి కెమెరాలు ఏర్పాటుచేశారు.

బకాయిల విడుదలకు రోడ్ మ్యాప్

యుటిఎఫ్ డిమాండ్



డిఆర్‌ఒకు వినతి అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉద్యోగులకు బకాయి ఉన్న సుమారు 20 వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు వెంటనే రోడ్డు మ్యాప్ ఇవ్వాలని యుటిఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి హేమలతకు యుటిఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పిఆర్‌సి కోసం తక్షణమే పిఆర్‌సి కమిషన్ నియమించాలని కోరారు. వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, డిఎ, పిఆర్‌సి బకాయిలు సుమారు 20 వేల కోట్ల రూపాయలు విడుదలకు తగిన రోడ్డు మ్యాప్ ఇవ్వాలని కోరారు. మెమో 57 ప్రకారం సుమారు 11 వేల మంది 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ వర్తింపజేయాలన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ఆదేశించినా ఆ ఫైల్‌కు మోక్షం కలగలేదని, వెంటనే దానిని పరిష్కరించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, కుప్రా భాస్కరరావు, జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.వెంకటినాయుడు పాల్గొన్నారు.

ఓపెన్ షెల్టర్ పునరుద్ధరణపై పరిశీలన

సాలూరు : పట్టణంలో ఓపెన్ షెల్టర్ పునరుద్ధరణపై జిల్లా అధికారులు బుధవారం నీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని పరిశీలించారు. గతంలో పట్టణంలో నిర్వహించిన ఓపెన్ షెల్టర్‌ని పునరుద్ధరణ చేయాలని నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతిపాదనలను రాష్ట్ర జువెనైల్ జస్టిస్, కరెక్షనల్ సర్వీసెస్‌కి పంపించింది. ఈ మేరకు ఆ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డిపిఒ బివి రవికుమార్, డిసిపిఒ సత్యనారాయణ, ఎల్‌సిపిఒ శ్రీధర్, ఐసిడిఎస్ అధికారులు ఎస్.ప్రసాద్, ఎస్.భారతి పరిశీలించారు. గతంలో నిర్వహించిన ఓపెన్ షెల్టర్ బిల్లు బకాయిలు చెల్లించాలని జిల్లా అధికారులను కోరారు.

29న కురుపాం మండల సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించి సమగ్ర సమాచారంతో హాజరుకావాలని సూచించారు. సర్పంచులు, ఎంపిటిసిలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తే, వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు. లేకుంటే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని తెలిపారు.

పాలకొండ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

సుడా చైర్మన్ రవికుమార్

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నగర పంచాయతీ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. బుధవారం నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావును మర్యాదపూర్వంగా కలిసి మాట్లాడారు. నగర్ పంచాయతీలో చేస్తున్న కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని, అందులో తనను కూడా భాగస్వామ్యం చేయాలని చైర్మన్ అన్నారు.



రెడ్డి శాంతిని పరామర్శిస్తున్న సుడా చైర్మన్ రవికుమార్, తదితరులు

పాలవలస కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖర్ కుటుంబాన్ని బుధవారం సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ పరామర్శించారు. ఆయన కుమార్తె, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని కలిసి సానుభూతి తెలియజేశారు. రవికుమార్ వెంట వైస్ ఎంపిపి వాకముడి అనిల్, కౌన్సిలర్లు కొరిగాన గంగునాయుడు, డి.పాపినాయుడు, ప్రశాంత్ కుమార్, వంజరాపు రమేష్, దుంపల చిన్ని తదితరులున్నారు

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం మండలం వెంకంపేట కూడలిలో బుధవారం ఎంవిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలకు కారణమవుతుందని, దీనిని డ్రైవర్లు గమనంలో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటారు ఇన్‌స్పెక్టర్లు వరప్రసాద్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యాధికారి హేమాక్షి

శీతాకాల రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం

ప్రజాశక్తి-సీతానగరం

శీతాకాలంలో వచ్చే పలు ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో మంచి ఉపశమనం కలుగుతుందని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి తెలిపారు. పలు ఆరోగ్య సమస్యలతో వైద్యశాలకు వచ్చిన వారికి బుధవారం ఆమె తనిఖీలు చేసి, ఆయుర్వేద మందులు అందజేశారు. వైద్యశాల ఆవరణలో ఉన్న వివిధ రకాల ఔషధ మొక్కలు, వాటి ఉపయోగాలు గురించి అక్కడ వారికి ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుష్ ఎఎన్ఎం వై.పద్మ ,తదితరులు ఉన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకి, మిర్తివలసలో పాఠశాలలను ఎంఇఒ సామల సింహాచలం బుధవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల పేర్లను తొలగించి, వారిని తక్షణమే డ్రాప్ బాక్స్‌లో నమోదు చేయాలని తెలిపారు. మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, ఫౌండేషన్ పాఠశాలలను ఏర్పాటు చేయడంలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు చెప్పారు.

పెదపెంకిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో అల్లు నారాయణమ్మ జ్ఞాపకార్థం బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 175 మందికి పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. 15 మందిని శస్త్రచికిత్సలకు విజయనగరంలోని పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు. నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ కంటి శిబిరాన్ని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కర్రి అప్పారావు ప్రారంభించారు.



బోర్డులను ఏర్పాటుచేస్తున్న భజన బృందం సభ్యులు

మంచిమనసు చాటుకున్న భజన బృందం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన శ్రీగౌరీశంకర భజన బృందం సభ్యులు మంచి మనసు చాటుకున్నారు. భజన బృందానికి వచ్చిన చందాలతో గ్రామంలో వీధుల పేర్లతో ఇనుప బోర్డులను ఏర్పాటుచేశారు. కొత్తగా వచ్చిన వ్యక్తులు వీధులను గుర్తించేలా ఉపసర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు ఆధ్వర్యాన వీటిని ఏర్పాటు చేయించారు. దీంతో భజన బృందం సభ్యులను గ్రామస్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు సింహాచలం, చిన్నారావు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలపై దర్యాప్తు

వేపాడ : మండలంలోని బొద్దాంలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇంటి పట్టాలపై సర్పంచ్ ఎర్ర రామసత్యవతి ఆధ్వర్యంలో తహశీల్దార్ జె.రాములమ్మ బుధవారం దర్యాప్తు చేపట్టారు. ఈ గ్రామంలో అనర్హులకు పట్టాలిచ్చారని కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. దీనికి స్పందించిన ప్రభుత్వం గ్రామంలో దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో తహశీల్దార్ ఆరుగురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టారు.

పోలమాంబ దరి.. చేరే దారేదీ?

ఉత్తరాంధ్ర ఇలవేల్పు పోలమాంబ ఆలయం ఉన్న శంబర గ్రామానికి మెరుగైన రహదారి లేని దుస్థితి నెలకొంది. అనేక సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. లక్షలాది మంది హాజరయ్యే శంబర జాతరకు వెళ్లేందుకు అనేక మార్గాలున్నాయి. సాలూరు, బొబ్బిలి, సీతానగరం మండలాల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఇందులో ఏ ఒక్క రహదారీ సక్రమంగా లేకపోవడం గమనార్హం. రోడ్లన్నీ గోతులమయం అయ్యాయి. మలుపుల వద్ద ప్రమాదకరంగా తయారయ్యాయి. శంబర జాతరను రాష్ట్ర పండగగా ప్రకటించినా, ఆదాయం బాగానే సమకూరుతున్నా సరైన రహదారి సౌకర్యం కల్పించేందుకు అధికారులు దృష్టిసారించడం లేదు. ఓసారి శంబర వెళ్లే రహదారులను పరిశీలిస్తే...

- నాలుగు రోజుల్లో శంబర జాతర
- అధ్వానంగా రహదారులు
- ఎక్కడికక్కడే గోతులు, గుంతలు
- ప్రమాదకరంగా మలుపులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-మక్కువ

ఒకప్పుడు పోలమాంబ జాతర చూసేందుకు శంబర గ్రామానికి వెళ్లాలంటే నాటుబండ్లపై సద్దన్నం పట్టుకొని పిల్లాపాపలతో బయలుదేరే పరిస్థితి.. కానీ ఇప్పుడు రహదారులు సౌకర్యం ఉన్నప్పటికీ కూడా అధ్వానంగా తయారవడంతో వాహనాలకు ఎన్నో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి ఇప్పుడు కూడా అలనాటి మాదిరిగా నాటుబండ్లనే ఆశ్రయించే పరిస్థితి దాపురించిందని చెప్పడంలో అతిశయోక్తి కాదన్నది ప్రజల వాదన. మండల కేంద్రానికి అటు చినబోగిలి నుంచి, ఇటు సాలూరు నుంచి బాగువలస మీదుగా, బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డివలస మీదుగా గజానికి ఒక గొయ్యి చందంగా మారిన రహదారుల గుండా ప్రయాణించాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు

గత ప్రభుత్వ హయాంలో సాలూరు నుంచి మక్కువకు సుమారు 21 కిలోమీటర్ల రహదారికి రూ.57 కోట్లు, సీతానగరం మండలం చినబోగిలి నుంచి మక్కువ వరకు సుమారు 16 కిలోమీటర్ల రహదారికి రూ.34 కోట్లు మంజూరు చేశారు. 2023-24 మధ్యకాలంలో కొంతమేర ఎర్త్ వర్క్ పనులు, పైపులైన్ స్లాబ్ కల్వర్టులు చేపట్టి సంబంధిత కాంట్రాక్టరు అలా వదిలేశారు. బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారన్నది అప్పట్లో వినిపించిన వాదన. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటివరకు కూడా రహదారుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి మండల ప్రజలు వెళ్లాలంటే నరకయాతన పడాల్సిన పరిస్థితి. కొద్దిరోజుల ముందు వరకు ఆర్‌టిసి కూడా తన సర్వీసులను నిలిపివేసి, ఇటీవల ఒక బస్సును మాత్రం తిప్పుతోంది. సాలూరుకు శంబర, మామిడిపల్లి మీదుగా రహదారి సౌకర్యం బాగుంది. బాగువలస కన్నా, ఆరు కిలోమీటర్లు అదనంగా ఉన్నా కొద్దిమంది మామిడిపల్లి రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. అధిక శాతం మంది మాత్రం బాగువలస మీదుగానే ప్రయాణిస్తున్నారు. మరోవైపు బొబ్బిలి రహదారి పరిస్థితి కూడా ఇంతే దారుణంగా ఉంది ఇప్పుడిప్పుడే ఈ రహదారికి మరమ్మతులు చేపడుతున్నారు. రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించినప్పటికీ సాలూరు, చినబోగిలి రహదారులకు మరమ్మతులు చేయకపోవడం దారుణమని ప్రజలంటున్నారు.



కొయ్యన్నపేట సమీపంలో రహదారి దుస్థితి



పాయకపాడు వద్ద రోడ్డుపై గోతులు, బుగ్గి

4 రోజుల్లో సాధ్యమా?

పోలమాంబ రాష్ట్ర జాతరకు నాలుగు రోజులు మాత్రమే గడువుంది. ఈ కాలంలో రహదారుల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టగలరా? అనే అనుమానమే. ఆయా కాంట్రాక్టర్లను ఒప్పించి రహదారుల మరమ్మతు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జాతర సమయం దగ్గర పడుతుండడంతో పోలమాంబ అమ్మవారి జాతరకు వెళ్లే మార్గం చూపాలని యాత్రికులు కోరుతున్నారు. రాష్ట్ర పండగగా ప్రకటించాక రెండోసారి జాతర జరుగనుంది. కానీ, ప్రభుత్వ పెద్దలు శంబరకు వచ్చే ప్రధాన రహదారులపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి శంబరకు వచ్చే రహదారులకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కొత్త పనులు ప్రారంభించాలని నిరసన



ఉపాధి కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో ఉపాధి కూలీలకు కొత్త పనులు ఇవ్వాలని, పాత మేట్లను కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం జియ్యమ్మవలస మండలం తుంబలిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.మోహన్ రావు, జి.శ్రీనివాసరావు, ఉపాధి కూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు పూర్తయి 2 నెలలు కావస్తోందని, పనులు లేక కూలీలు వలస వెళ్లి పోతున్నారని తెలిపారు. వెంటనే ఉపాధి పనులు కల్పించి, వలసలు నివారించాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వం మారుతున్నప్పుడల్లా ఉపాధి మేట్లను మారుస్తున్నారని, టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అలాగే చేస్తుందని తెలిపారు. పాత మేట్లను కొనసాగించాలని డిమాండ్‌చేశారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

ప్రజాశక్తి-పాచిపెంట

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని తాడూరు కొత్తవలస గ్రామంలో రైతు గమ్మెల ఎర్రయ్య పొలంలో గులి పద్ధతిలో చోడి పంట ప్రదర్శన క్షేత్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. గులి చోడి సాధారణ పద్ధతి కంటే దాదాపు రెట్టింపు దిగుబడి ఇస్తుందని ఎఒ తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి చిరుధాన్యాలను మద్దతుధర కల్పించి కొనుగోలు చేస్తుందన్నారు. చోడి పంట విస్తీర్ణాన్ని పెంచుతూ దిగుబడిని కూడా పెంచేదిశగా ఆలోచనలు చేయాలని కోరారు. అనంతరం రైతు చింత గంగయ్య పెరటి తోటలో పెంచుతున్న ద్రాక్ష చెట్టును పరిశీలించారు. దిగవశీల గ్రామంలో రైతులతో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు పంటల ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్ కుమార్, ప్రకృతి సేద్య సిబ్బంది తిరుపతి నాయుడు పాల్గొన్నారు.



పాచిపెంట.. రైతులకు సూచనలు చేస్తున్న ఎఒ తిరుపతిరావు

గులిరాగి పంట సందర్శన

సీతంపేట : మండలంలో గూడగుడ్డి గ్రామంలో రెండున్నర ఎకరాల్లో విస్తీర్ణంలో ఉన్న గులిరాగి పంటను రీజనల్ ఆఫీసర్ ప్రకాశ్, ఆర్‌టిఒ హేమ సుందర్, వెలుగు అసోసియేషన్ సంస్థ డైరెక్టర్ బి.సంజీవరావు సందర్శించారు. ఇంకా ఎక్కువమంది రైతులతో ఈ పంట వేయించాలని సిబ్బందికి సూచించారు. దిగుబడులు పెంచాలని రైతులకు సూచనలు ఇచ్చారు. క్యాడర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయించాలన్నారు జీడి మామిడి తోటల్లో మార్కస్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి బాలు, అంబోజీ రమేష్, ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు

ప్రతి కుటుంబానికీ 100 రోజుల పని



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

ప్రజాశక్తి-వీరఘట్టం

ఉపాధి హామీలో ప్రతి కుటుంబానికీ వంద పని దినాలు కల్పించాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ క్షేత్ర సహాయకులను ఆదేశించారు. బుధవారం స్థానిక కంప్యూటర్ సెంటర్లో క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే విధంగా పంట పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేయాలన్నారు. కమ్యూనిటీ సోక్ ఫిట్ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఎపిఒ జి.సత్యంనాయుడు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వి.కృష్ణప్రసాద్, టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సకాలంలో విధులకు హాజరు కావాలి

విధులకు సకాలంలో హాజరుకావాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని కిమ్మి గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ సర్వేల నివేదికలు, గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు, తదితర అంశాలపై సిబ్బందిని ఆరాతీశారు. హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి పి.తిరుపతి, హెచ్ఎం బి.అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

పశు వైద్య శిబిరాలను పాడి రైతుల సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ వైద్యాధికారి కె.శైలజ అన్నారు. బుధవారం మండలంలో నీలకంఠపురం గ్రామంలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరంలో దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, గర్భకోస చికిత్స, చూడి పరీక్షలు చేశారు. అవసరమైన వాటికి ఇంజక్షన్లు వేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.మన్మథరావు, మాజీ ఎంపిపి నీలకంటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి నానాజీ, టిడిపి నాయకులు ప్రదీప్ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని ఇప్పలవలస, జోగింపేట, తామరకండి, బక్కుపేట గ్రామాల్లో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఎడి సిహెచ్ దేనికుమార్, మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు మాట్లాడుతూ పాడి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బి.చిరంజీవులు, ఎం.సంజీవరావు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని జమదాలలో పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పాడి రైతులు తమ పశువులను, గొర్రెలను, మేకలను తీసుకువచ్చి నివారణ మందులు, అంటురోగాలకు టీకాలు వేయించుకున్నారు. పాల ఉత్పత్తుల పెరుగుదలకు, మూగ జీవాల ఆరోగ్యానికి మేలైన పద్ధతులు పాటించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి, మాజీ ఎంపిపి గొట్టాపు వెంకట నాయుడు, పశువైద్యులు రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై ముమ్మరంగా సర్వే

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని నడుకూరు, కంబరవలస, నడిమికెల్ల కడకల్ల, తదితర గ్రామాల్లో బుధవారం కుష్టు వ్యాధిపై ముమ్మరంగా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు శాంతి కుమారి, ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ సహాయకులు పాల్గొన్నారు.

శంబరలో యాంటీ లార్వా

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని శంబర గ్రామంలో పిహెచ్‌సి వైద్యులు రమ్యసాయి ఆధ్వర్యంలో బుధవారం యాంటీ లార్వా కార్యక్రమం చేపట్టారు. జాతర సందర్భంగా అటు యాత్రికులకు, ఇటు ప్రజలకు దోమల బెడద లేకుండా నివారణ చర్యలు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లోనూ కాలువల్లో, మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశంలో యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటరమణ, వైద్య సిబ్బంది విజయలక్ష్మి పాల్గొన్నారు.

లోయలో పడ్డ గ్యాస్ వ్యాను

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో వబ్బంగి ఘాట్ రోడ్డులో బుధవారం అదుపు తప్పి గ్యాస్ వ్యాన్ లోయలో పడింది. ఈ ఘటనలో ఎవరికేమీ కాక పోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. కురుపాం నుంచి గ్యాస్ సిలిండర్ల వ్యాను.. కాకిలి మీదుగా వబ్బంగి వెళ్తోంది. ఘాట్‌రోడ్డులో అదుపు తప్పి లోయలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఏమీ కాకపోవడంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే స్థానికుల సహాయంతో గ్యాస్ సిలిండర్లను జాగ్రత్త పరిచారు.



లోయలో పడిన గ్యాస్ వ్యాన్

యుపిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జగన్నాథపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, టీకా కార్యక్రమాన్ని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ కోసం సమీప గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. ఆరోగ్య తనిఖీ వివరాలు ఎంసిపి కార్డులో పరిశీలించారు. కాన్పు తేదీలపై గర్భిణులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. గైనకాలజిస్ట్ జి.నిహారిక గర్భిణులకు యుపిహెచ్‌సిలో స్కానింగ్ నిర్వహించారు. ప్రతి రోజూ ఆరోగ్య కేంద్రానికి తనిఖీల కోసం ఎంత మంది వస్తున్నారని ఒపి రికార్డులో ఆయన పరిశీలించారు. వ్యాక్సిన్, మందుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. లెప్రసీ, ఎన్‌సిడి సర్వేలు, అంగన్వాడీ, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ గురించి అడిగి గుర్తించిన ఆరోగ్య సమస్యలపై దృష్టిసారించి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

అనంతరం కొత్తవలస 7, 8 వార్డులో సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని డాక్టర్ జగన్మోహన్ పరిశీలించారు. ఎంతమంది పిల్లలకు టీకాలు వేశారు, టీకా వివరాలు, ఆర్‌సిహెచ్ రికార్డులో పరిశీలించారు. మొబైల్‌లో యూవిన్ పోర్టల్ పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తకుండా నవజాత శిశు ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గర్భిణీ, శిశు ఆరోగ్య సూచనలకు సంబంధించి పోస్టర్లను టీకా కేంద్రంలో ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎంజిఎం చాంద్, సూపర్‌వైజర్లు సత్తిబాబు, ఇందిర, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్స్ డేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-పాచిపెంట

ఈ నెల 25న జాతీయ ఓటర్స్ డేను ఘనంగా నిర్వహించాలని తహశీల్దార్ డి.రవి... బిఎల్ఒలను ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓటర్స్ డే వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులతో గ్రామాల్లో మానవహారం నిర్వహించాలన్నారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయాలని చెప్పారు. ఒక్కొక్క బూత్ పరిధిలో ఒక సీనియర్ ఓటర్‌కు సన్మానం చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వం బిఎల్ఒలకు పంపిణీ చేసిన టీ షర్టు, టోపీలను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, సీనియర్ సహాయకులు పి.తిరుమలరావు, ఎంఇఒలు జోగారావు, సతీష్ పాల్గొన్నారు.



టీషర్టులను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ రవి, డిటి చంద్రశేఖర్, తదితరులు

శిథిల వంతెనపై

అధిక లోడుతో రాకపోకలు

ప్రజాశక్తి-కొమరాడ

డంగభద్ర సమీపంలో జంఝావతి కుడి కాలువపై ఉన్న బ్రిడ్జి మీదుగా అధిక లోడుతో క్వారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న వంతెనను సిపిఎం, గిరిజన సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 10 గిరిజన గ్రామాల ప్రజల కోసం సిపిఎం పోరాటంతో 2006లో వంతెన నిర్మాణం చేపట్టారని తెలిపారు. తమ్మనదొరవలస సమీపంలోని క్వారీ యాజమాన్యం భారీ లోడులతో లారీలను నడపడం వల్ల బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి క్వారీ వాహనాల రాకపోకలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి కూలితే పది గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు.



శిథిలావస్థకు చేరిన వంతెనను చూపిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

ఏరియా ఆస్పత్రిలో సదరం శిబిరం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రిలో బుధవారం సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సదరం శిబిరం నిర్వహించారు. సుమారు 70 మందికి నేత్ర వైద్య నిపుణులు రేఖ నేత్ర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సదరం శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్హులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ పోస్ట్ లేకపోవడంతో వైద్యులకు పని భారం పెరిగిందని చెప్పారు. ఆ పోస్టు భర్తీ చేస్తే మరింత ఎక్కువ మందికి వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న నేత్ర నిపుణులు రేఖ

డ్రగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండల కేంద్రంలో దోనుబాయి కూడలి వద్ద సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ వై.అమ్మన్నరావు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మహిళా చట్టాల గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని, అది మీకు రక్షణ కవచంలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్, తదితరులు ఉన్నారు